



కూడ పాలకవర్గం ఎప్పుడో?

కామారెడ్డి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా మంజూరైన కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కూడ) ఏర్పడిన విషయం తెలిసిందే. కూడ ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా కాంగ్రెస్‌లోని ఆశావహులకు పదవుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. అన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పాలకవర్గాలు ఏర్పాటు చేసిన కామారెడ్డిలో మాత్రం పదవులను భర్తీ చేయకపోవడంతో ఆశావహులు నిరుత్సాహంలో ఉన్నారు. ఇప్పటికీ చైర్మన్, డైరెక్టర్ల పోస్టుల కోసం పలువురు కాంగ్రెస్ సెకండ్ క్యాడర్ నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. కూడ పదవులను కట్టబెట్టాలంటూ ఆశావహులు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. అయితే కూడ పాలకవర్గంలోని ప్రధాన పదవి అయిన చైర్మన్ కోసం జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు తమ నియోజకవర్గానికే పట్టుపడుతున్నట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులు ముఖ్యనేతల మధ్య కూడ పాలకవర్గం కోసం సమన్వయం కుదరకపోవడంతోనే కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఏ నిర్ణయం తీసుకోలేకపోతుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. కూడా పాలకవర్గంతో పాటు జిల్లాలో చాలానే నామినేటెడ్ పదవులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని భర్తీ చేయకపోవడంతో కాంగ్రెస్ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

మూడు మున్సిపాలిటీలు.. 460 గ్రామాలతో కూడ

గత ప్రభుత్వ హయాంలో ఆయా జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసింది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోనూ కూడ ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదించారు. కానీ ఫైల్ మాత్రం ముందుకు కదలలేదు. గ్రామాలను కూడ పట్టణాల మాదిరి తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు జిల్లాలో కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసి మున్సిపాలిటీలతో పాటు గ్రామాలను కూడా విలీనం చేసింది. పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను పెంచింది. అందులో భాగంగానే జిల్లాకు ఆరు నెలల క్రితం కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మంజూరు చేసింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు మున్సిపాలిటీలతో పాటు 460 గ్రామాలను విలీనం చేస్తూ కూడను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 535 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 70 శాతానికి పైగా కూడలో కలిపారు. మొదట కామారెడ్డి మున్సిపాలిటీకే కూడ పరిమితం అవుతుందనుకున్న పరిధి జిల్లా మొత్తం విస్తరించడంతో ప్రాధాన్యత మరింత పెరిగింది. కూడ చైర్మన్, డైరెక్టర్ పదవులపై కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు సైతం ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా ఉన్నారు.

- పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడంతో ఆశావహుల్లో నిరుత్సాహం
- పదవులపై నేతల్లో నెలకొంటున్న ఆశలు
- పరిధి విస్తరించడంతో పెరిగిన ప్రాధాన్యం
- మూడు మున్సిపాలిటీలు, 460 గ్రామాలతో ఏర్పాటైన కూడ
- కూడ చైర్మన్ పదవికి పోటీ పడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు
- డైరెక్టర్ పోస్టులకు సైతం డిమాండ్
- పాలకవర్గ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రతినిధుల మధ్య కుదరని సయోధ్య
- తమ నియోజకవర్గానికే చైర్మన్ పదవి కోసం నేతల పట్టు

చైర్మన్, డైరెక్టర్ పోస్టులకు ఎందుకింత పోటీ

రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లు, పరిశ్రమల భవనాలు ఇతరత్రా నిర్మాణాల అనుమతులు కూడా నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి కూడ మౌలిక వసతుల కల్పనకు నిధులు కూడ బాగానే వచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా జిల్లాలో జరి గే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రొటోకాల్ కలిగి ఉండడం, ప్రత్యేక వాహనం అలవెన్స్‌ల సౌకర్యం ఉండడంతో ఎలాగైన కూడ చైర్మన్ పదవి దక్కించుకోవాలని తహతహలాడుతున్నారు. జిల్లాలో ఎక్కడ నలుగురు కలిసిన కూడ చైర్మన్ ఎవరు అవుతారనే చర్చ జరుగుతోంది. నాలుగు నియోజకవర్గాల నుంచి కూడ చైర్మన్‌కు పలువురు సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. తమకంటే తమకే చైర్మన్ పదవి వస్తుందని ఆయా నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన నాయకులు చైర్మన్ పదవిపై తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రజాప్రతినిధులపై ఒత్తిడి

కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(కూడ) చైర్మన్‌తో పాటు ముగ్గురు డైరెక్టర్‌ల నామినేటెడ్ పదవులు ఉంటాయి. చైర్మన్ ముగ్గురు డైరెక్టర్‌లతో కలిసి కూడ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పదవులను దక్కించుకునేందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తీవ్ర పోటి పడుతున్నారు. చైర్మన్ పదవిరి పోటీ నెలకొంటుంది. ఈ పదవిని దక్కించుకునేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డిల ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. చైర్మన్, డైరెక్టర్ పదవులకు తమ పేర్లను సిఫారస్ చేయాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు కూడ చైర్మన్ పదవికి పోటీలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కూడ చైర్మన్ పదవిని తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నేత లింగాగౌడ్ పేరును ఎమ్మెల్యే సిఫారస్ చేశారు. అయితే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన చంద్రకాంత్‌రెడ్డికి కట్టబెట్టారు. కూడ చైర్మన్ పదవి కామారెడ్డిని, ఎల్లారెడ్డికి దక్కుతుందో లేదో చూడాలి.

ఉదయం చిన్న వ్యాపారాలు..

రాత్రి పెద్ద దొంగతనాలు!

- జిల్లాలో రెచ్చిపోతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠా
- కుటుంబాలతో కలిసి రోడ్ల వెంబడి దేరాలు వేసుకుని జీవనం
- జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు, తాళాలు వేసి ఉన్న ఇళ్లే వారి టార్గెట్
- వారి ఆట కట్టించిన కామారెడ్డి పోలీసులు

భిక్కనూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దొంగతనాల్లో వీరి స్టైలే వేరు. మహారాష్ట్రకు చెందిన కొందరు ఒక ముఠాగా ఏర్పడి జాతీయ రహదారిని ఆనుకున్న గ్రామాలను ఎంచుకోవడం, ఎంచుకున్న గ్రామాల్లో పగటిపూట ప్లాస్టిక్ వస్తువులు, పూసలు, తదితర వస్తువులను విక్రయిస్తూ ఆ గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గమనించి రాత్రుల్లో దొంగతనాలను చేయడంతో పాటుగా జాతీయ రహదారిపై ఉన్న లే బై, సర్వీస్ రోడ్లపై పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను టార్గెట్ చేసుకుని ఇటీవలి కాలంలో మారణాయుధాలతో బెదిరించి దాడి చేసి డబ్బులను, వస్తువులను అందినకాడికి ఎత్తుకెళ్తున్నారు. వీరు ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకున్న గ్రామాల శివారుల్లో వాహనాల్లో వచ్చి డేరాలను వేసుకుని కొన్ని రోజుల పాటు ఉంటూ ఉదయం పూట ఆ గ్రామాల్లో పొట్టకూటి కోసం చిన్నచిన్న వ్యాపారాలను చేస్తున్నట్లు నమ్మిస్తూ రాత్రి వేళల్లో పెద్దపెద్ద దొంగతనాలు చేసి అక్కడి నుంచి మరొక చోటుకు వెళ్తున్నట్లు సమాచారం. ఇలాంటి దొంగతనాలు ఇటీవల వరుసగా జరగడంతో జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకుని ఏఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టి వారి ఆటను కట్టించారు. పక్కా సమాచారం మేరకు భిక్కనూరు మండలంలో అలాంటి అంతర్‌రాష్ట్ర ముఠాను కామారెడ్డి పోలీసులు పట్టుకున్నారు.

కుటుంబాలతో కలిసి రోడ్ల వెంబడి దేరాలు వేసుకుని జీవనం

ఎవరికి అనుమానం కలుగకుండా ఈ అంతర్‌రాష్ట్ర ముఠా కుటుంబాలతో (మహిళలు, పిల్లలతో) కలిసి జాతీయ రహదారిపై ఎంచుకున్న గ్రామ శివారుల్లో డేరాలను వేసుకుని కొన్ని రోజుల పాటు అక్కడే ఉంటారు. ఉన్నన్ని రోజులు చుట్టూ గ్రామాల్లో ప్లాస్టిక్ వస్తువులు, పూసలు, తదితర వాటిని విక్రయించుకుంటూ ఆయా గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని రాత్రి వేళల్లో దొంగతనాలు చేస్తారు. దీంతో పాటుగా జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలపై దాడి చేసి వాహనదారులను మారణాయుధాలతో బెదిరించి, అవసరమైతే దాడులకు పాల్పడి విలువైనా వస్తువులను, డబ్బులను, సెల్ ఫోన్‌లను ఎత్తుకుని వెళ్లి ఎప్పటిలాగానే వారి వేసుకున్న డేరాలకు చేరుకుంటారు. ఇక్కడ కొన్ని రోజులు ఉండి మరో చోటుకు వెళుతుంటారు.

పార్థీ గ్యాంగ్ ఆట కట్టించిన కామారెడ్డి పోలీసులు

జాతీయ రహదారి గుండా వాహనాలతో పాటుగా గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాకు కామారెడ్డి పోలీసులు బ్రేకులు వేశారు. గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఇలాంటి దొంగతనాలు జరుగుతుండటంతో పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ ముమ్మరం చేయగా ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నది మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్‌గా గుర్తించారు. వీరిలో ఏడుగురిని భిక్కనూరు మండలంలో పట్టుకుని వారి వద్ద నుంచి మారణాయుధాలు, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిని వారిని పట్టుకునేందుకు గాలిస్తున్నారు. కాగా ఈ గ్యాంగ్ ఉమ్మడి జిల్లాలో నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పని చేయని సీసీ కెమెరాలు

ప్రస్తుత రోజుల్లో శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం కాగా నేరాలు జరిగిన కొద్ది సమయంలోపై ఈ సీసీ కెమెరాల సహాయంతో పోలీసులు ఎన్నో కేసులను ఛేదించిన సంఘటనలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని ప్రతీ గ్రామంలో సైతం దాతల సహాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినప్పటికీ చాలా గ్రామాల్లో పలు కారణాలతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఇలాంటి దొంగతనాలు జరిగినప్పుడు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

- సంపత్‌కుమార్, భిక్కనూరు సీఐ

గ్రామాల్లో వస్తువులను విక్రయించడానికి వచ్చే కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అలాంటి వారిపై దాడులకు పాల్పడకుండా తమకు సమాచారం ఇవ్వాలి. ఇటీవల జరిగిన సంఘటనలతో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడం జరిగింది. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి. కల్లు దుకాణాలు, వ్యాపార సముదాయల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ఎస్పీ రాజేష్‌చంద్ర



ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని కేసుల నమోదు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఆవరణను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. నేరాల నియంత్రణ కోసం పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ అనుమానితులను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమాన్ జయంతి ర్యాలీ రూటు గురించి తెలుసుకొని తగు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా సిసి కెమెరాలు పనితీరును పరిశీలించి ఇంకా ఎక్కువ మొత్తంలో కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయనతో పాటు డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సీఐ రవీందర్ నాయక్, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై మహేష్, తాడ్వాయి ఎస్సై కొండల్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్‌జే సెట్ 2025కు దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : టీజీఆర్‌జేసీ సెట్ 2025 ప్రవేశాల కోసం పదవ తరగతి బాల బాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చని మద్నూర్ గురుకుల బాలుర విద్యాలయం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు గాను ప్రవేశ అర్హత పరీక్ష కోసం ఆసక్తి గల 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తెలంగాణలో 35 గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయని సూచించారు. ఇందుకోసం http://tgrjc.cgg.gov.in/ ఆన్‌లైన్ లింక్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. రూ.200 దరఖాస్తు రుసముతో 24 మార్చి 2025 నుంచి 23 ఏప్రిల్ 2025 వరకు ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షా ప్రతిభా, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ నేతృత్వంలో ప్రవేశ పరీక్ష మే10, 2025 శనివారం జరుగుతుందని చెప్పారు. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు ఫోన్ నెంబర్లు 040 - 24734899 సంప్రదించవచ్చునని చెప్పారు.



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన

తమిళనాడు వైద్య బృందం

బిచ్కుంద, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం తమిళనాడుకు చెందిన వెల్లూరు వైద్య బృందం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆహ్వానం మేరకు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల జబ్బుల వారిని వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారి కి ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జున్ అప్ప శెట్కార్, పీసీసీ డెలిగేట్ సభ్యులు విఠల్‌రెడ్డి, నాగనాథ్, గంగాధర్, నౌషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

15న జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి రాక

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈనెల 15న జిల్లాకు రానున్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, సివిల్ సప్లయ్, మార్కెటింగ్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్డీవో, వాటర్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ల మీద రివ్యూ చేయనున్నారు. వాటితో పాటు ఇటీ వల జిల్లాలో చోటు చేసుకున్న కల్తీ కల్లు వ్యవహారంపై ఇప్పటికే అధికారు లపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎక్సైజ్‌శాఖలో కొందరు సిబ్బంది పని తీరుపై మంత్రి దృష్టికి పలువురు నాయకులు తీసుకెళ్లినట్లు సమాచారం.

అట్టహాసంగా.. హనుమాన్ శోభాయాత్ర





జిల్లా కేంద్రంలో భారీ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

- జిల్లాలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- విశ్వహిందు పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర
- పట్టణమంతా కాషాయమయం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జన్మదినోత్సవం పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిజనవాడ ప్రాంతంలో గల కోడూరు హనుమాన్ ఆలయంలో, పెద్దబజార్‌లోని హనుమాన్ ఆలయంలో, పంచముఖి హనుమాన్ ఆలయంలో, అశోక్‌నగర్‌లోని హనుమాన్ ఆలయంలో, శ్రీరాంనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో, వివేకానంద, ఎన్‌జీవోస్ కాలనీలోని ఆలయాలతో పాటు తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం లాగానే కోడూరు హనుమాన్ ఆలయం వద్ద నుంచి సాయంత్రం 6 గంటల తర్వాత బజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రను విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు ప్రారంభించారు. పెద్దబజారు, రైల్వేకమాన్‌తో పాటు ప్రధాన వీధుల గుండా తిరిగి పాత బస్టాండ్, సిరిసిల్లా రోడ్డు, జేపీఎన్ రోడ్డు, పాంచ్ చౌరస్తా గుండా ఆలయం వరకు నిర్వహించారు. పట్టణంలోని యువకులు కాషాయ వస్త్రాలు, కండువాలు కప్పుకొని పెద్దఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ శోభాయాత్రను విజయవంతం చేశారు. హనుమాన్ జన్మ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అన్ని పార్టీల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. యువకులతో కలిసి నృత్యాలు చేస్తూ ఆద్యంతం ఉత్సాహం నింపేలా చేశారు. హిందువాహిని ఆధ్వర్యంలో ధర్మశాలలో హనుమాన్ చాలీసాను పటించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మశాలలో హనుమాన్ చాలీసా పటిస్తున్న భక్తులు



ఆంజనేయ విగ్రహానికి డోలారోహనం చేస్తున్న భక్తులు



శ్రీరాంనగర్‌లో..

ఎంపీ సమక్షంలో బీజేపీలోకి వీడీసీ సభ్యులు



కమ్మర్‌పల్లి వీడీసీ సభ్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీఅర్వింద్

కమ్మర్‌పల్లి,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో గ్రామకమిటీ సభ్యులు వడ్ల తిరుపతి,కుమ్మరి గణేష్,లక్ష్మణ్ గౌడ్, శేఖర్ గౌడ్‌లు పార్టీలో చేరగా ఎంపీ ధర్మపురి అర్వింద్ వారికి పార్టీ ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, చింత ప్రవీణ్, రమేష్ రెడ్డి, కమల్, మల్లేష్ యాదవ్, అరుణ్, సంతోష్‌రెడ్డి, నరేష్, బాజన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి



నందిపేట పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

నందిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి బాధితులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సాయి చైతన్య ఆదేశించారు. శనివారం సాయంత్రం నందిపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ సిబ్బందితో మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలు మోసపోకుండా ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలన్నారు. గేమింగ్ యాప్‌ల పట్ల గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సినజాగ్రత్తలను సిబ్బందికి సీపీ శ్రీ సాయి చైతన్య వివరించారు. ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకే జరుగుతున్నాయని, హెల్మెట్ లేకపోవడం వలనే ప్రయాణికులు మృతి చెందుతున్నారని, హెల్మెట్ ధరించడానికి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించాలని సీపీ ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి, వాహనాల పార్కింగ్‌ను సీపీ పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్, కంప్యూటర్ సిబ్బంది పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లలో పని చేస్తున్న సిబ్బంది సాధక, బాధకాలను అడిగి తెలుసుకోవాలని సీపీ శ్రీ సాయి చైతన్య సూచించారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఐ ఎం చిరంజీవి, సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వీవీఆర్ భవనంలో పలువురికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. హుస్నాబాద్ కాలనీకి చెందిన భోజన్న కుటుంబ సభ్యులకు రూ. 60 వేలు, సైరాబాద్ కాలనీకి చెందిన అబ్దుల్ ముగ్గిర్‌కు రూ.18వేల చెక్కును ఆయన అందజేశారు.ఈసందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డికి,నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నరెడ్డి, పండిత్ పవన్, మారుతిరెడ్డి,భూపేందర్, తవ్వన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి మైనార్టీ నాయకుడి విరాళం



విరాళం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

భీమ్‌గల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో సప్తమహా సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్నదాన సత్రానికి ఇదే వార్డుకు చెందిన మహామ్మద్ ఇక్రమ్ అలీ అనే కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు తనవంతుగా రూ. 10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. సర్వమతాల సారం ఒక్కటే అన్న భావనతో కుల మతాలకు అతీతంగా హనుమాన్ జయంతి అన్నదాన సత్రానికి ఇక్రమ్ అలీ ప్రతి సంవత్సరం తనవంతుగా సహాయం చేయడం గొప్ప విషయమని పలువురు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నె సురేందర్, శ్రీనివాస్, సప్త మహా సంఘం సభ్యులు కూన రఘు, దడివి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెంజల్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోర్గాం శివారులో గల కందకుర్తి వైపు వెళ్లే వ్యవసాయ పంట భూమిలో మగ వ్యక్తి మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించడం జరిగిందన్నారు. మృతుడి వయసు 50నుంచి 55సంవత్సరాలు ఉండన్నారు. తెల్ల రంగు పాయింట్, షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఎవరైనా సమాచారం తెలిస్తే 8712658874 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై చంద్రమోహన్ పేర్కొన్నారు.

కోటగిరిలో యువకుడి ఆత్మహత్య

కోటగిరి,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్(20)అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. లక్ష్మణ్ తరుచు ఫోన్ వాడడంతో తండ్రి బాబయ్య మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మణ్ మైనారిటీ శ్మశాన వాటికలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని ఎస్సై సందీప్ పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

● జిల్లావ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘాల నాయకులు



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



తుంగినిలో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్



వర్ని మండలంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం



వేల్పూర్ హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న స్వాములు



నందిపేటలో అన్నదానంకు వంట సామగ్రిని అందజేస్తున్న యువకులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని వివిధ హనుమాన్ ఆలయాలలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి శనివారం పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ ఆల యం లేని గ్రామం లేదని గ్రామాలకు హనుమంతుడు రక్షణగా ఉంటాడని ప్రజలు విశ్వసిస్తారన్నారు. హనుమాన్ అంటే బలము, అనుగ్రహము, నిజాయితీ అన్నారు. అదే విదంగా వివిధ గ్రామాలలో హనుమాన్ మాల ధరించిన స్వాములు మండుటెండలో పాదయాత్రగా కొండగట్టుకు వెళ్తు న్నారని వారు జాగ్రత్తగా వెళ్ళాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, జాగిర్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్:హనుమాన్ జయంతి సందర్భంగా బోధన్‌లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంతో పాటు పట్టణంలోని అన్ని హనుమాన్ దేవాలయాల్లో, సాలూర, బోధన్ మండలాల్లోని అన్ని హనుమాన్ దేవాలయాల్లో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమంతుడికి ప్రీతికరమైన రోజు శనివారం రోజు ఆయన జన్మోత్సవం శనివారం రావడం విశేషమని వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా మారుతీ మందిరంతో పాటు పలు హనుమాన్ మందిరాల్లో యజ్ఞం, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం నుండే భక్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో మారుతీ మందిరం చైర్మన్ గుండెటి శంకర్, ఆలయ కమిటీ నిర్వాహకులు, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, భక్తులు, హనుమాన్ స్వాములు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హనుమాన్ స్వాముల హనుమాన్ చాలీసా పారాయణం ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. కొంతమంది స్వాములు ఇరుముడులు కట్టుకుని కొండగట్టుకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, హిందు సంఘాల నేతలు, యువత, మహిళలు, భక్తులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

● బోధన్‌లో 12అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో గల వ్యాయమ శాల భవన ప్రారంభం మరియు హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ యాదవ్, పెర్క స్వామి, శ్రీనివాస్, శేఖర్, దాసు, రాంబాబు, వెంకటేష్, శివ, బాలకృష్ణ, అశోక్, శ్రీకాంత్, స్వామి, పట్టణ వ్యాపారవేత్తలు హెచ్‌పీ గ్యాస్ ఆదినారాయణ, విద్యాసంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేల్పూర్:వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి చిత్ర పటంతో గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు.

ఎడపల్లి: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి హనుమాన్ ఆలయాలకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. 41రోజుల పాటు నిష్ఠతో దీక్షలు చేపట్టిన హనుమాన్ స్వాములు, భక్తులు. గ్రామాల ప్రజలు పాల్గొని హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.

వర్ని:మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రంతో పాటు సేవాలాల్ తండా, మల్లారం గ్రామాల్లో హనుమాన్ ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. హనుమాన్ స్వాములు పోచారంను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

రెంజల్: మండలంలోని రెంజల్, తాడ్‌బిలోలి, సాటాపూర్, బోర్గాం, నీలా, కందకుర్తి, దూపల్లి, దండిగుట్ట, వీరన్నగుట్ట, కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి, మొగులాల్ తండా గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోటగిరి: కోటగిరి మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కోటగిరి, ఎత్తొండ, యాద్గార్‌పూర్, కొత్తపల్లి, అడ్కాస్‌పల్లి, సుద్దులం, రాంపూర్, వల్లభాపూర్ గ్రామాలలో హనుమాన్ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

● పోతంగల్ మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోతంగల్ మండల కేంద్రంలో హనుమాన్ పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. రుద్రూరు మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా కొనసాగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి.

మెండోర:మండలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను భక్తుల భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండంలో మెండోర, బుస్సాపూర్, సోన్‌పేట్, పోచంపాడ్, చాకిర్యాల్, కోడిచర్ల, సావెల్, దూదిగాం, వెల్కటూర్ గ్రామాలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ మందిరంలో ఆంజనేయ స్వామిని దర్శించుకొని, మహా అన్నదానం, సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల కమిటి సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

నవీపేట: హనుమాన్ జయంతి వేడుకలను శనివారం మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుండే ఆయా గ్రామాలలోని హనుమాన్ మందిరాలలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మార్వాడీ బ్రహ్మణ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు అశోక్ కుమార్ దయమా ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.మోహన్ రెడ్డి తుంగిని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

● తుంగిని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి అడిషనల్ కలెక్టర్

మండలంలోని తుంగిని హనుమాన్ మందిరంలో శనివారం అడిషనల్ కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి వచ్చిన అడిషనల్ కలెక్టర్‌కు ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేద పండితులు అడిషనల్ కలెక్టర్‌కు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్ రావు, తదితరులున్నారు.

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో వీర హనుమాన్ యాత్ర విశ్వహిందూ పరిషత్,బజరంగ్‌దల్ ఆధ్వర్యంలో శోబాయమానంగా నిర్వహించారు. మామిడిపల్లి అనంత ఆంజనేయ స్వామి ఆలయం నుండి ప్రారంభమైన హనుమాన్ విజయయాత్ర మామిడిపల్లి చౌరస్తా కొత్తబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా మీదుగా గోల్‌బంగ్లా శివాజీ చౌక్ వరకు కొనసాగింది. మహాశివుడు, వీర హనుమాన్, బాల రాముని విగ్రహాలను ఊరేగిస్తు కొన సాగిన హనుమాన్ విజయయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేస్తు అలరించారు.

ముప్కాల్:ముప్కాల్,బాల్కొండ కేంద్రంతో పాటుఆయాగ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు శోభాయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని అన్ని గ్రామాలలో శని వారం హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల హనుమాన్ ఆలయాల వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో హనుమాన్ భక్తులు శోభా యాత్ర నిర్వహించారు.

భీమ్‌గల్:హనుమాన్ జయంతి వేడుకలను శని వారం కేంద్రంలోని అన్ని వీధులలో ఘనంగా జరుపుకున్నారు. బోయగిల్ల లోని శ్రీ పవనత వీరాంజనేయ కమిటీ ఆధ్వర్యంలో ఐదు సంఘాల సభ్యు లు ఘనంగా పూజలు జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డొంకేశ్వర్:మండలంలోని ఆయాగ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామా ల్లో హనుమాన్ ఆలయంలో స్వామి వారిని ప్ర త్యేకంగా పూలతో అందంగా అలంకరించారు. పలు రకాల వంటకాలతో నైవేద్యాలు సమర్పించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు.

మోస్రా: చందూర్, మోస్రా మండల కేంద్రాలతో పాటు మండలంలోని గోవూర్, లక్మాపూర్, చింతకుంట, ఘన్‌పూర్ ఆయా గ్రామాల్లో వీరహనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆంజనేయ గురు స్వాములు, స్వాములు, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నందిపేట:మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతిఉత్సవాలు జరిగాయి.మామిడి తోరణాలతో ఆలయాలు అలంకరించారు.దీక్షా పరులు దీక్షను విరమించారు. ఆలయాల్లో పూజలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.నందిపేటలో మండల కేంద్రంలోని పాతూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజా కార్యాక్రమాలు, సత్యనారాయణ వ్రతాలు, అన్నదానం చేశారు.చింరాజ్‌పల్లి శివారులోని దొంగపెర్కాం డ్లు ఆలయంలోమాలధారణ సభ్యులు ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. బజార్‌కొత్తూర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

వర్ని: వర్ని మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. హనుమాన్ చాలీసాలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు చేసి కుస్తీపోటీలు నిర్వహించారు.

పెర్కిట్:హనుమాన్ జయంతి పురస్కరించు కొని ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి అనంత ఆంజనేయ స్వామి ఆల యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్మూర్, చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.అదే విధంగా పట్టణంలోని పెద్ద బజార్, ముదిరాజ్ సంఘం హనుమాన్ మందిరం, జంబిహనుమాన్, పెర్కిట్‌లోని శివాలయం వద్ద గల హనుమాన్ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటి వారు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలూర్:ఆలూర్ మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మిర్ధాపల్లి, మచ్చర్ల, దేగాం, ఆలూర్ గ్రామాలలో హనుమాన్ ఆలయాలలో పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో హనుమాన్ మాల ధరించిన స్వాములు, ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



తాడ్‌బిలోలిలో..



కోటగిరిలో..



మెండోరలో ..

ఎస్ఎస్‌వీఎంలో సంస్కార సాధన తరగతులు

భీమ్‌గల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):విద్యార్థిని విద్యార్థులకు వేసవి సెలవులలో సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో సంస్కార సాధన తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం రవి కుమార్, పరిపాలనాధికారి నర్సా రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఎండలో తిరిగి అనారోగ్యానికి గురికాకు డదన్న ఉద్దే శ్యంతో సంస్కార సాధన తరగతులను ఈ నెల 28వ తేదీ నుంచి మే12 వరకు ఉదయం 8 గంటల నుంచి 12.30 వరకు నిర్వహిస్తున్నామ న్నారు. తల్లిదండ్రులు ఈఅవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

వేల్పూర్ మాదిగ ఉపకులాల కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో అంబేద్కర్ మాదిగ ఉపకులాల సమావేశాన్ని శనివారం నిర్వహిం చారు.ఈసం దర్భంగా అంబేద్కర్ మాదిగ ఉపకులాల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బక్కొల్ల ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షుడు కొండ్లప్ప ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా నల్లూరివీరేందర్, క్యాషియ ర్ కలిగోట మధన్, జేయింట్ సెక్రటరీగా నల్లూరికేతన్, సభ్యులు కత్తి రవీందర్, కల్చరల్ అడ్వైజర్ నల్లూరి విజయ్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎక్సైజ్ అధికారులు దాడి- ఒకరి అరెస్టు



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాటేపల్లి తండాలో గురువారం రాత్రి బిచ్కుంద ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒకరి వద్ద 46 గంజాయి మొక్కలతో పాటు 200 గ్రాముల ఎండు గంజాయి, మరొకరి వద్ద 16 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. సిఐ సత్యనారాయణ కథనం ప్రకారం వివరాలు..... కాటేపల్లి తాండ అక్రమంగా ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతూ, గంజాయి సాగు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేయగా, బామన్ మధుసింగ్ ఇంటి ఆవరణలో 16 గంజాయి మొక్కలు స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నారని తెలిపారు. దీంతో పాటుగానే తాండలో మరొకరైన బర్దావర్ రాయిలా ఇంటిపై దాడి చేయగా ఇంటి ఆవరణలో పెంచుతున్న 46 గంజాయి మొక్కలతో పాటు 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాదీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడికి కోర్టులో హాజరపర్చగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించగా నిందితుడిని నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నగేష్, హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య, సిబ్బంది నవీన్ రెడ్డి, పరుశురాం, శ్రీధర్, దేవిసింగ్, శ్రీకాంత్, వనిత, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ గ్రామ పరిధిలో రహదారిపై ధాన్యం కుప్పలు వేసి ఓ వ్యక్తి ప్రమాదానికి కారణ మైన అంగ్రేజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పెద్ద కొడప్‌గల్ గ్రామానికి చెందిన పండరి గత రెండు రోజుల కిందట అంజనీ గ్రామంలో జరుగుతున్న సప్తహ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి మోటార్ సైకిల్‌పై తిరిగివస్తుండగా పెద్దకొడప్‌గల్ గ్రామ పరిధిలో సర్వీస్ రహదారిపై వేసి ఉంచిన ధాన్యం కుప్పలను కప్పి ఉంచిన నల్ల కవర్‌ను గమనించక ధాన్యం కుప్పపై నుండి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి కుమారుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంగ్రేజ్‌పై కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం



దోమకొండలో సర్వే చేస్తున్న విద్యార్థులు

దోమకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):యువత జీవన నైపుణ్యలను పెంపొందించుకోవాలని డాక్టర్ అంజయ్య అన్నారు. టీయూ దక్షిణ ప్రాంగణం జాతీయ సేవా పథకం యూనిట్-6 ఆధ్వర్యంలో చేపట్టిన వేసవికాల ప్రత్యేక శిబిరం శనివారం నాటికి ఆరవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు దోమకొండలోని శివరాంమందిర్ ఆలయం ఏరియాలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ బాబ్జి, కోఆర్డినేటర్ గణేష్ యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

'షబ్బీర్‌అలీ కృషితోనే 50 పడకల ఆసుపత్రి'

దోమకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కృషితోనే దోమకొండకు 50 పడకల ఆసుపత్రి మంజూరైనట్లు మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం 30 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 50 పడకలుగా మారుస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, మైనార్టీ నాయకుడు కలీం పాల్గొన్నారు.

బోధన్‌లో హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతం

● పోలీసుల భారీ బందోబస్తు ● పాత బస్టాండ్‌లో హనుమాన్ చాలీసా పారాయణం



పోలీసుల బందోబస్తు దృశ్యం



పాత బస్టాండ్‌లో పారాయణం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా బోధన్‌లో హిందు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన శోభాయాత్ర ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని పాత బస్టాండ్‌లో వందలాదిమంది హిందు యువత హనుమాన్ స్వాములు, మహిళలు, ప్రజలు నేలపై కూర్చుని భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గత 8సంవత్సరాలుగా హనుమాన్ చాలీసా పారాయణం రథంపై నుండి వేద పండితుడు హనుమాన్ పారాయణం చేస్తే వీరు నిల్చుడి పారాయణం చేసేవారు. కాని ఈసారి భక్తి భావం పెంపొందింది. మహిళలు ద్విచక్ర వాహనాలపై హనుమాన్ యాత్ర ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది యువత భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. హనుమాన్ చాలీసా పారాయణంతో పాత బస్టాండ్ ప్రాంగణమంత హనుమాన్ చాలీసా పారాయణంతో మార్మోగింది. అనంతరం అక్కడి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబులతో ఎస్సైలు, పట్టణ పోలీసు బలగాలు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారుతి మందిరం చైర్మన్ గుండెటి శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, హిందు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్ పీహెచ్‌సీ తనిఖీ

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రాకార్డులను, చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్‌లను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. సమయపాలన పాటించని వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకుటామని హెచ్చరించారు.

ఫటా..ఫట్...

కేజీబీవీలో 262 మంది విద్యార్థినులు

● ఆర్ స్వప్న, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి



ఆంధ్రజ్యోతి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎంతమంది విద్యార్థినులున్నారు.

ప్రత్యేకాధికారి: కేజీబీవీలో 262 మంది విద్యార్థినులు చదువుతున్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యాలయంలో ఎంతవరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేకాధికారి: విద్యాలయంలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: 10వ తరగతిలో ఎంతమంది పరీక్షలు రాశారు

ప్రత్యేకాధికారి: 10వ తరగతిలో 50 మంది విద్యార్థినిలు పరీక్షలు రాశారు.

ఆంధ్రజ్యోతి: కేజీబీవీలో ఎంత మంది టీచర్లు ఉన్నారు.

ప్రత్యేకాధికారి: కేజీబీవీలో 29 మంది టీచర్లు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: మెనూ ప్రకారం విద్యార్థినులకు బోజనం పెడుతున్నారా

ప్రత్యేకాధికారి: మెను ప్రకారం విద్యార్థినిలకు బోజనం పెడుతున్నాం. సోమ, మంగళ, గురు, శుక్రవారంలో కోడి గుడ్లు, బుదవారం చికెన్‌తో భోజ నం పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కేజీబీవీలో నీటి సమస్య ఉందా?

ప్రత్యేకాధికారి: విద్యాలయంలో నీటి కొరత నివారణకు వన్‌హెచ్‌పీ మోటర్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి వచ్చింది. త్వరలో ఏర్పాటు చేయిస్తాం.

ఆంధ్రజ్యోతి: కేజీబీవీలో గదుల కొరత ఉందా?

ప్రత్యేకాధికారి: ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం నూతన బిల్డింగ్ నిర్మించాల్సిన అవసరం ఉంది.

● (మోర్తాడ్, ఆంధ్రజ్యోతి)

కప్పల వాగుపై రెవెన్యూ అధికారుల నిఘా కరువు

● అక్రమంగా తరలిస్తున్న ఇసుక

భీమ్‌గల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ కప్పల వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ అధికారుల హస్తం కూడా ఉండడంతో ఇందుకు వారికి భారీగానే ముడుపులు అందుతున్నట్లు సమాచారం. దీంతో కప్పల వాగుపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇసుక అక్రమార్కులు వాగునుండి సమయ పాలన లేకుండా ఇసుకను కొల్లగొడుతున్నారు. భీమ్‌గల్, బడా భీమ్‌గల్ కప్పల వాగు నుంచి ఇసుకను కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాలకు తరలిస్తున్న మండల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతుల పేరుతో అక్రమ రవాణ చేస్తు ప్రభుత్వ ఆదాయానికి కండి కొడుతున్న సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఇసుక అక్రమార్కుల ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి.

ఇసుక జాతరలో అక్రమాలు

ప్రజల ఇంటి నిర్మాణాల కోసం ఇసుక కోసం ప్రభుత్వం ప్రతీవారం అనుమతులతో ఇసుకను అందిస్తుంటే దీనిని మాత్రం కొందరు అపహాస్యం చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే యజమానుల వద్ద డబ్బులు తీసుకొని ట్రాక్టర్ యజమానులు డీడీలు కడుతూ వారు కట్టిన దానికన్నా అదనంగానే ఇసుకను తరలిస్తున్నారు. సదరు ట్రాక్టర్ యజమానికి రెవెన్యూ అధికారులు దగ్గరుండి పదులు ట్రిప్పుల వే బిల్లులు అందించడం గమనార్హం. దీంతో వారు పర్మిషన్ రోజు ఉదయం 4 గంటల నుంచి వాగులోకి ట్రాక్టర్ దించి ఇసుకను కొల్లగొడుతున్నారు. ఇటీవల బడా భీమ్‌గల్ కప్పల వాగులో అనుమతితో పాయింట్ ఏర్పాటు చేయగా వే బిల్లులు తీసుకున్న ట్రాక్టర్ యజమానులు ఉదయం 4 గంటలకే నాలుగు ట్రాక్టర్లతో ఇసుకను తరలించగా పోలీసులు పట్టుకున్నారు.



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

వేరే మండలాలకు తరలింపు

భీమ్‌గల్, బడా భీమ్‌గల్ కప్పల వాగు నుంచి ఇసుకను ఇతర మండలాలకు బడా భీమ్‌గల్ కొనసాగిన ఇసుక పాయింటు నుండి బడా భీమ్‌గల్ మీదుగా ఆక్లూర్, మోతే, రామన్నపేట్, దోస్‌పాల్ మీదుగా కమ్మర్‌పల్లి కేంద్రానికి తరలించినట్లు సమాచారాం. ఇదుకు ప్రతి గ్రామానికి ట్రిప్పులకు వంద రూపాయలు చెల్లిస్తున్నట్లు బాహాటంగా ఇసుక వ్యాపారులు చెప్పుకుంటున్నాఉ. కొందరైతే డబ్బులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో అధిక ధరలకు వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు.

నామమాత్రపు కేసులు

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు యజమానులపై నామమాత్రపు కేసులు కావడంతో జరిమాణాలు చెల్లిస్తే పోతుందిలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి అక్రమార్కులపై గతంలో జిల్లా అధికారులు చేపట్టిన మాదిరి వాల్టా చట్టం ప్రకారం ఒకసారి పట్టుబడితే రూ. 5 వేలు, రెండవ సారి పట్టుబడితే రూ. 20 వేల జరిమానా, మూడోసారి పట్టుపడితే అట్టి ట్రాక్టర్ సీజ్ చేయాలని నిబంధనను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హనుమాన్ జయంతి సందర్భంగా కుస్తీ పోటీలు

మోస్రా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చుట్టు పక్కల మండలాలు, బాన్సువాడ నియోజకవర్గంలోని మల్లయోధులు పాల్గొన్నారు. చివరి పోటీలో గెలుపొందిన యోధుడికి తులం వెండి కడియం బహూకరించారు. రెండవ బహూమతి అర తులం వెండి ఉంగరం బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోటగిరి, కొల్లూర్‌లలో కుస్తీ పోటీలు

కోటగిరి: ఉమ్మడి మండలంలోని కోటగిరి, కొల్లూర్ గ్రామాలలో శనివారం గ్రామ కమిటీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రతీ యేటా కుస్తీపోటీలు నిర్వహించడం ఆనవాయితీ. కుస్తీపోటీలకు ఆయా గ్రామాల నుంచి కుస్తీవీరులు తరలివచ్చి పోటీల్లో తమ ప్రతిభను చాటారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కప్ప రాజన్న, బీమా సాయిరెడ్డి, కొల్లూర్‌లో సంపత్, మాధవరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అభంగపట్నంలో కుస్తీపోటీలు

● గెలుపొందిన మహారాష్ట్రకు చెందిన ఒంటి చేతి యువకుడు

నవీపేట: మండలంలోని అభంగపట్నంలో శనివారం సాయంత్రం కుస్తీపోటీలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పోటీలలో జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహరాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున మల్లయోధులు కుస్తీపోటీలలో పాల్గొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకా కర్ఖెల్లికి చెందిన గణేష్ శెట్టివార్ సలిగార్గే అనే ఒంటి చేతి యువకుడు కుస్తీపోటీలలో పాల్గొని వెయ్యి రూపాయల నగదు పురస్కారాన్ని గెలుపొందాడు. ఒంటి చేతిలో కుస్తీపోటీలలో పాల్గొని విజయం సాధించిన యువకుడిని పలువురు అభినందించారు. మహరాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన గంగాధర్ కుస్తీపోటీలలో గెలుపొందగా అతడికి రెండు తులాల వెండి కడియం బహూకరించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, పోచయ్య, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.



కొల్లూర్‌లో కుస్తీ పోటీలు కొనసాగుతున్న దృశ్యం



తిమ్మాపూర్‌లో విజేతకు బహుమతిని అందజేస్తున్న దృశ్యం



అభంగపట్నంలో కుస్తీపోటీల్లో పాల్గొన్న ఒంటి చేతి యువకుడు గణేష్



గెలుపు పురస్కారాన్ని తీసుకొంటున్న ఒంటి చేతి యువకుడు గణేష్

రైతు మహోత్సవ మేళాలో మంత్రిని కలిసిన
పసుపు రైతు సంఘ పరిశ్రమ డైరెక్టర్లు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం రైతు మహోత్సవ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్ పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ డైరెక్టర్లు తరలివెళ్లారు. అనంతరం రైతుమేళాలో మనోహరాబాద్ గ్రామానికి చెందిన పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ డైరెక్టర్లు నెలకొల్పిన స్టాల్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మాల నాగేశ్వర్‌రావు సందర్శించి రైతులు పండించిన విలువ ఆధారిత పసుపు ఉత్పత్తులను చూసి మంత్రి అభినందించారు. ఖచ్చితంగా ఇదే నెలలో నిజామాబాద్ జిల్లాలో కూడా ఇలాంటి రైతు మహోత్సవ మేళాలను పెట్టాలని అక్కడున్న అధికారులకు మంత్రి సూచించారని మనోహరబాద్ పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ డైరెక్టర్ పి. తిరుపతి రెడ్డి తెలిపారు. త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న రైతు మహోత్సవ మేళాలో రైతులు పాల్గొని ఇలాంటి మేళాలు పెట్టినట్లయితే రైతులకు మంచి మేలు జరుగుతుందని మంత్రి అభిప్రాయ పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, ఏవీ రావు, జేయంకేపీఎం సూపర్ వైజర్ మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రలో విదేశీయుల సందడి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో విదేశీయులు సందడి చేశారు. ఇతర పనుల మీద జిల్లాకు వచ్చిన వారు నగరంలో హనుమాన్ ర్యాలీ నిర్వహిస్తున్నారనే సమాచారంతో కంఠేశ్వర్ ప్రాంతానికి వచ్చారు. అర్మేనియా దేశానికి చెందిన గ్రాంట్, క్యారియండ్‌లు ర్యాలీలో పాల్గొని సందడి చేశారు. విదేశీయులు ర్యాలీలో పాల్గొనడంతో యువకులు వారితో ఫోటోలు దిగేందుకు ఆసక్తిని చూపించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఉన్న వారు ర్యాలీ జరిగే ప్రాంతానికి వచ్చి కాశాయ జెండాలను ఊపుతూ ర్యాలీలో పాల్గొనడం ఉత్సాహం నింపింది. ఈ సందర్భంగా ర్యాలీ విశిష్టతను, ర్యాలీ ప్రత్యేకతను వారు అడిగి తెలుసుకున్నారు.



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న అర్మేనియా దేశస్థులు

తాళ్ల రాంపూర్‌లో ఈత వనం దగ్ధం

ఏర్గట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో శనివారం గౌడ కులస్థులకు సంబంధించిన ఈత వనం దగ్ధం అయింది. వివరాల్లోకి వెళితే గౌడ కులస్థులకు సంబంధించిన ఈత వనంలో దాదాపు 150కి పైగా చెట్లకు మంటలు వ్యాప్తి చెంది దగ్ధమైనట్లు స్థానికుల సమాచారంతో అక్కడి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఈత చెట్లు కాలిపోయినట్లు గౌడ కులస్థులు తెలిపారు.



మంటల్లో కాలిపోయిన ఈతచెట్లు

అంబేద్కర్ కృషి ఫలితంగా.. మెరుగుపడిన మహిళల స్థితి

● పాలమూరు వర్సిటీ ప్రొఫెసర్ మనోజ



టీయూలో అంబేద్కర్ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ యాదగిరి



పాలమూరు వర్సిటీ ప్రొఫెసర్ మనోజను సన్మానిస్తున్న వీసీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కులు రక్షణ చట్టాల గురించి హిందూ వివాహాల చట్టాల గురించి భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ చేసిన కృషి ఫలితంగానే దేశంలో మహిళల స్థితి మెరుగైందని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోజ అన్నారు. తెలంగాణ వర్సిటీలో శనివారం మహనీయుల జయంతి పురస్కరించుకొని ఉమెన్‌సెల్ డైరెక్టర్ డా.భ్రమరాంబిక అధ్యక్షతన జరిగిన అంబేడ్కర్ ఆలోచనలు, స్త్రీల హక్కులు లింగ న్యాయం అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు మనోజ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుటుంబ వ్యవస్థలో సమానమైన ఆస్తి లభించాలన్న హిందూ కోడ్ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టి బిల్లు వీగిపోవడంతో డా.అంబేద్కర్ నిరసనగా న్యాయ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం ఆమె గుర్తు చేశారు. అయిన్నప్పటికీ రాజ్యాంగంలో స్త్రీలకు, పురుషులతో సమానంగా వేతనాలు చెల్లించే చట్టాలు చేయడం స్త్రీలను గౌరవించి ప్రసూతి సెలవులను ఇప్పించే చట్టాలను చేయడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమన్నారు. వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ యువత పెడదారులు పడుతున్న నేపథ్యంలో వర్తమాన సమాజంలో స్త్రీల హక్కులు లింగన్యాయం అనే అంశంపై చర్చించడం అత్యవసరమన్నారు. వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు అంబేద్కర్ రచనలు అధ్యయనం చేసి సమాజానికి చైతన్య వంతమైన ఆలోచనలు తెలుపలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, రిసోర్స్ పర్సన్ డా.స్రవంతి, డీన్ రాం బాబు, సీవోఈ సంపత్ కుమార్, నేతా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో గ్రంథాలయ భవనం ప్రారంభం

ఏర్గట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామాభివృద్ధి కమిటీ భవనంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని శనివారం జిల్లా గ్రంథాలయం చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి యువకులకు, నిరుద్యోగులకు విజ్ఞానం పెంపొంది ప్రభుత్వం ఉద్యోగుల పరీక్షలకు సంబంధించి అన్ని రకాల పుస్తకాలతో పాటు వార్త పత్రికలతో అన్ని వసతులు ఏర్పాటు చేయన్నుట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన జిట్టపోయిన శ్రీనివాస్‌కు మంజూరీ అయిన 38 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బద్ధం లింగారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ టార్పలిన్లు అందేనా..!?

● ఇబ్బందులు పడుతున్న రైతులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతూ అద్దె కోసం రూ. వేలు ఖర్చు పెడుతున్నారు. వరి కోతల సమయంలో ధాన్యాన్ని ఆర బెట్టేందుకు వర్షాల భారీ నుంచి కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఐదారేళ్ల క్రితం 8 ఫీట్ల పొడవు ఆరు ఫీట్ల వెడల్పుతో మందం ఉన్న టార్పాలిన్ల ధర మార్కెట్లో రూ 2,500 వరకు ఉండగా వ్యవసాయ శాఖ తరపున వాటిని రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందజేసింది. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఎంతో సౌలభ్యంగా ఉండేది. వాటి సరఫరా నిలిచిపోవడంతో తాము రూ. వేలు ఖర్చు చేసి అద్దెకు తీసుకుంటూ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా ఈదురు గాలులు అకాల వర్షాలతో టార్పాలిన్లు లేక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి వాటిని కాంటా వేసే వరకు కనీసం ఇరవై రోజుల సమయం పడుతుంది. టార్పాలిన్ల అద్దెకు తీసుకువచ్చి వాటికి రెండు నుంచి నాలుగు వేల వరకు అద్దె చెల్లించాల్సి వస్తుందంటున్నారు. ఈ మేరకు మారుమూల గ్రామాలు గిరిజన తండాల్లో సైతం టార్పాలిన్లు అద్దెకు లభిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై తమకు టార్పాలిన్లు అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అద్దె టార్పలిన్లలో ధాన్యం ఆరబోయిస్తున్న రైతులు



గ్రామాల్లో అద్దెకు ఇవ్వడానికి ఉంచిన టార్పాలిన్లు

● **ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వాలి**

టార్పలిన్లు అద్దెకు తెచ్చుకుని సుమారు రూ.రెండున్నర వేల నుంచి మూడు వేల వరకు అద్దె చెల్లించడం వల్ల అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇస్తే మాకు అనువుగా ఉంటుంది.

- సాయిలు, రైతు

● **సరఫరా కావడం లేదు**

ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా కావడం లేదు. దీంతో రైతులకు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వస్తే రైతులకు అందజేస్తాం.

- నదీముద్దీన్, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డిలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



ఎల్లారెడ్డిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామాలలో శనివారం జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హనుమాన్ మందిరాల వద్ద ఉదయం నుంచి పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం సాయంత్రం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పప్పు హను మాన్ టెంపుల్ నుంచి హనుమాన్ రాముని విగ్రహాలతో కేంద్రంలోని ప్రధాన వీధిలో గుండా భక్తులు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బజరంగ్దళ్, విశ్వహిందూ పరిషత్ వివిధ పార్టీల నాయకులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవం తంగా నిర్వహించారు. ర్యాలీకి తగిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేష్ రూట్ మ్యాప్ పరిశీలించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల సమస్యలు పరిష్కరించాలి



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయసలహాదారుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిని టీజీఈజేఏసీ నాయకులు కలిశారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ జీపీఎఫ్‌పార్ట్‌ఫైనల్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్ రిఇంబర్స్‌మెంట్,పెండింగ్ బిల్స్‌పెండింగ్ 5డీఏలు, పీఆర్‌సీ, హెల్త్‌కార్డులు, సీపీఎస్ రద్దు, జీవో 317 అంశం, పెన్షనర్ల బకాయిలు, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ మొదలగు తదితర 57 సమస్యలను పరిష్కరించేవిధంగా కృషిచేయాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిం చాలని విన్నవించారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను ప్రవేశపె ట్టాలని మెనిపెస్టోలో ఇచ్చిన విధంగా హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.ఈ కార్యక్రమానికి టీజీజేఏసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ దేవేందర్, నాగరాజు, సాయిరెడ్డి, కుశాల్,హన్మంత్‌రెడ్డి,ప్రవీణ్‌కుమార్, రాజు,లింగం, ముజిబొద్దిన్, దేవుల తదితరులు పాల్గొన్నారు.

● ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేత

బాన్సువాడటౌన్: టీజీఈజేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగ , ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు , ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సంఘ సభ్యులు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా టీజీఈ జేఏసీ చైర్మెన్ నరాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ డీఏలు , పీఆర్‌సీ , హెల్త్ కార్డులు , సీపీఎస్ రద్దు , పెన్షనర్ల బకాయిలతో పాటు 57 సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరినట్లు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలని , మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలపారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు , తదితరులున్నారు.

గండి మాసానిపేట్‌లో కుస్తీ పోటీలు



గండి మాసానిపేట్ కుస్తీ పోటీలలో కుస్తీలో పాల్గొన్న మహిళ


ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండి మాసానిలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా మందిరంలో ఉదయం నుంచి పూజలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కొబ్బరికాయ కుస్తీ నుంచి మొదలుకొని చివరగా పది తులాల వెండి కడియం కుస్తీ వరకు నిర్వహించారు. ఈ పోటీలలో చుట్టుపక్కల ప్రాంతాల మల్ల యోధులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు అందులో మహిళా కూడా కుస్తీ పోటీలలో పాల్గొన్నారు. కుస్తీలలో గెలుపొందిన వారికి నగదుతో పాటు చివరికి కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి పది తులాల వెండి కడియం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజు శ్రావణ్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామారెడ్డిలో రథోత్సవం

రామారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో శ్రీ సీతారామ చంద్రస్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాల బ్రహ్మోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి రథోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రంగు రవీందర్‌గౌడ్, ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ ఎంపీసురేష్ షెట్కర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్

లింగంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాల ను తనిఖీ చేశారు. తనిఖీలో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై ప్రకాశ్ తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారికి, లైసెన్స్‌లు, బండి ఆర్‌సీ లేకుండా నడిపేవారికి జరిమాన విధించినట్లు తెలియజేశారు. పెండింగ్ చాలన్లు ఉన్న వాహనదారుల వద్ద పెండింగ్ చాలన్లు వసూలు చేసినట్లు తెలిపారు. తనిఖీలో కానిస్టేబుల్ శంకర్, మదన్‌లాల్, షైమద్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.



లింగంపేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఘనంగా హనుమాన్ జయంతి

మద్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గ్రామ గ్రామాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎక్కడ చూసినా అంజన్న నామస్మరణ మారుమ్రోగింది. సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో జుక్కల్ శాసన సభ్యులు తోట లక్ష్మీ కాంతారావు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే, ఆయా నాయకుల పేరిట అర్చన చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు. రామభక్తుడు, వాయునందనుడు, పవనసుతుడు అయిన ఆంజనేయుడి అనుగ్రహం, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని హనుమంతుడి దీవెనలతో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే కోరారు. మండలంలోని ఆయా గ్రామాలలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు జరుపుకున్నారు. యువకులు ర్యాలీలలో పాల్గొని జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలనుంచి భక్తులు సరిహద్దులోని అంజన్న దర్శనానికి తరలివచ్చారు.

● హనుమాన్ జయంతి సందర్భంగా ఆడియో విడుదల

మారుతిమందిరం సలాబత్పూర్ శ్రీ ఆంజనేయ స్వామిపై పాటను విడుదల చేశారు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన రచయిత రుద్రంగి రమేశ్ రచించిన ఈ పాటను ఈ మందిరం చైర్మన్ రామ్ పటేల్ మండల నాయకులు హనుమాన్లు స్వామి, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్ శ్రీ కైలాస్ కాంకాని తదితరులు పాల్గొన్నారు. ఈ పాటకు వీడియో మేకింగ్ అవార్ మోహన్ చేసినట్లు వారు వెల్లడించారు. అంజన్న పై రాసిన పాట భక్తులను ఆకర్షిస్తుందని. రచయిత రమేష్ అభిప్రాయపడ్డారు.

గాంధారి:గాంధారి మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని హనుమాన్ అల యంలో మున్నూరుకాపు పటేల్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని గౌరారం, పేట్ సంఘం గ్రామాల్లో ఘనంగా హనుమాన్ జయంతిని నిర్వహిం చారు. అన్నదానకార్యక్రమానికి ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని అంజనేయ స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని పాతూరి ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ఘనంగా డోలారోహణం నిర్వహించారు. గ్రామాలలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామివారికి సింధూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి చిత్ర పటాలను రథాలపై ఏర్పాటుచేసి భారీగా ఊరేగింపులు నిర్వహించారు. ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరం , గౌలిగూడ , శ్రీరామ మందిరం , పాతబాన్సువాడ , పంచముఖి హనుమాన్ మందిరాల్లో శనివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు , అర్చనలు చేపట్టారు. సింధూరంతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి భజనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

మహమ్మద్‌నగర్:మండలంలోని గున్కుల్,బూర్గల్,తుంకిపల్లి, గాలిపూర్, సింగితం, కోమలంచ గ్రామాలలో హనుమాన్ ఆలయాల వద్ద వీరాహనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఆంజనేయ స్వామి ర్యాలీ నిర్వహించి హనుమాన్ చాలీసా పఠించారు. భజనకీర్తనలతో ఆంజనేయ స్వామి పల్లకిసేవ కొనసాగింది. అన్నదానకార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా మండలంలోని తుంకిపల్లి తండాలో ఆంజనేయ స్వామివారికి తండావాసులు నైవేద్య ప్రసాదాలను అందించారు. అభిషేకాలతో,అర్చనలతో ఆంజనేయ నామ స్వరాన్ని పఠిస్తు, పాడిపంట, బాగుండాలని ఆంజనేయ కటాక్షాన్ని మాపై ఉంచాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌టీసెల్ అధ్యక్షుడు లోక్యానాయక్, గోప్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.

రామారెడ్డి:కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, పోసానిపేట్, మద్దికుంట, రెడ్డిపేట్, గిద్ద మోషంపూర్, ఇస్సన్నపల్లి, కన్నాపూర్, అన్నారం, ఉప్పల్వాయి తదితర గ్రామాల్లో, తండాల్లో శనివారం శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి చంద్రాల అలంకరణ, పూల మాలలు, తమలపాకు అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామ యువకులు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వామివారికి సమర్పించారు. అనంతరం స్వామి వారిని ఈ సంవత్సరం మా గ్రామాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయు ఆరోగ్యలతో పాడి పంటలు పుష్కలంగా పండలని గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, సామాల శీలాసాగర్, నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,నాయకులు మల్లేష్, సంజీవ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నరేష్, మల్లేష్ యాదవ్, మహిపాల్ రెడ్డి, రాజిరెడ్డి, బండి పోచయ్య, గాండ్ల ప్రవీణ్, మాజీ సరంచులు, మాజీ ఎంపీటీసీలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, గ్రామాల పెద్దలు, గ్రామాల యువత, గ్రామాల భజన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద:మండలంలోని ప్రతీగ్రామంలోహనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని దాస హనుమాన్ మందిరం వద్ద ఉదయం హనుమాన్ పారాయణం, అంజన్న కు అభిషేకాలు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదానంఏర్పాటు చేశారు.

లింగంపేట: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని గ్రామ గ్రామాన హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపు కున్నారు. మండల కేంద్రంలోని జంబి హనుమాన్, చిన్న హనుమాన్ గుడి, శెట్పల్లి, పర్మల్ల, మెంగారం, బోనాల్, బాయంపల్లి, బాణాపూర్, పొల్కంపేట, నల్లమడుగు, మోతె, భవాని పేటలతో పాటు పలు గ్రామాలలో భక్తులు స్వామివారికి చంద్రం పెట్టి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎటువంటి అల్లర్లు కాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దోమకొండ:మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.దోమకొండలోని అంద్యాలపల్లి హనుమాన్ ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఊరదమ్మ వద్ద ప్రారంభమై ప్రధాన వీధుల గుండా శోభయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్, పెద్దిరెడ్డి సిద్దారెడ్డి, కదిరె గోపాల్‌రెడ్డి, మ్యాక నాగరాజు, పనాస అంజయ్య, మెంగని బాల్‌రాజు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: హనుమాన్ జయంతోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ప్రజలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. గత వారం రోజుల నుండి హనుమాన్ ఆలయాలను అందంగా రంగులు చేసి ముస్తాబు చేశారు. ఇక శనివారం హనుమంతుండి పుట్టిన రోజు ఉండటంతో ఉదయాన్నే భక్తులు హనుమాన్ ఆలయాలకు పోటెత్తారు. ఉదయం స్వామి వారికి చందనోత్సవం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన వేద పండితులు అనంతం ప్రజలకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఇక జయంతిని పురస్కరించుకుని కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాలలో భ జన కీర్తనలతో పాటు డిజె పాటలతో యువకులు గ్రామాలలో ర్యాలీ నిర్వహి ంచారు. పండుగ సందర్భంగా గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.



సలాబత్‌పూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తోట, మాజీ ఎంపీ బీబీ పాటిల్

నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని గ్రామ గ్రామాన శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు గ్రామాలలో ఉన్న హనుమాన్ మందిరం ఆవరణలో భజన కీర్తనలు చేశారు. హనుమాన్ మందిరం పైన హనుమాన్ జెండాలను ఎగరవేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భజన కీర్తనలు చేశారు. హనుమాన్ మందిర్ ఆవరణలో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలోని భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పిల్లాపాపలతో మమ్మల్ని కాపాడాలని హనుమాన్ మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రముఖులు రాజకీయ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భిక్కనూరు: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని పలుగ్రామాల్లో హనుమాన్ జన్మదిన వేడుకలను శనివారం హనుమాన్ సేవాసమితి, వీడీసీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో హనుమాన్ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి సౌండ్స్ మధ్య యువకుల నృత్యాలతో శోభయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం ఆయాగ్రామాల్లో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కాగా హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కంచుకుని మండలంలోని ఆయాగ్రామాల్లోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుండే భక్తులు హనుమాన్ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పలుగ్రామాల్లో పెద్దఎత్తున హనుమాన్ స్వాములు, వీడీసీ, భజనమండళ్ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పోచారం



హనుమాన్ చాలీసాను పఠిస్తున్న మహిళలు



ఆంజనేయస్వామికి డోలారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

వేసవి కాలంలో నీటి ఎద్దడిని నివారించాలి



వైద్యాధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

జుక్కల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో నీటి ఎద్దడి నివారించి ప్రజలకు పుష్కలంగా తాగు నీరు అందించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు శనివారం జుక్కల్ మండలం పెద్దగుల గ్రామంలో బోరు మోటర్‌ను ప్రారంభించి అనం తరం గ్రామ ప్రజలతో మాట్లాడారు. పెద్దగుల గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది అని గ్రామ పెద్దలు నెల రోజుల క్రితం తన దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులకు ఆదేశించి బోరు మోటర్ వేయడం జరిగిందని ఆయ న తెలిపారు. ప్రతి గ్రామంలో వేసవి కాలంలో తాగునీరు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. నీటి వసతి పై అధికారులు ఎప్పటికప్పుడు గమ నించి సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదాల దేశాయ్, రమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బోరు మోటార్లు ప్రారంభిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి

జుక్కల్ నియోజకవర్గం లో వివిధ మండలాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుపేద ప్రజలకు వైద్యులు మెరుగైన వైద్యం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశించారు. శనివారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన కామారెడ్డి జిల్లా ఉన్నత వైద్య అధికారులు సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు వారి పట్ల ప్రేమ చూపించి వైద్య చికిత్సలు నిర్వహించాలని సూచించారు. ఆస్ప త్రులు ఉండే డాక్టర్లు పేషంట్ల రోగాలు నిర్ధారించి వారికి మందులు ఇవ్వాలని ఆయన అన్నారు. 30 పడకల ఆసుపత్రిని వంద పడకలు పెంచడానికి ప్రణాళిక రూపొందించినట్టు ఆయన తెలిపారు ఈ. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ విజయ భాస్కర్, వైద్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిరోజు వైన్స్‌లు బంద్ చేయాలి

మాచారెడ్డి,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్స వాల సందర్భంగా సోమ వారం వైన్స్‌లు బంద్ చే యాలని అదనపు కలెక్టర్ విక్టర్‌కు పాల్వంచమండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు నరేష్ వినతిపత్రం అందిం చారు. రాజ్యాంగం రచించిన అంబేద్కర్ జయంతి రోజున ప్రజల ఆరోగ్యా లకు హాని కలిగించే మద్యాపానాన్ని ని షేధించాలని కోరామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్సిల్‌పై ఆంజనేయస్వామి విగ్రహం



బాన్సువాడటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ మోహన్ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పెన్సిల్ గ్రాఫైట్‌పై ఆంజనేయస్వామి విగ్రహాన్ని చెక్కాడు. ఆయన కళను పలువురు ప్రశంసించారు.

స్వర్ణదేవాలయాన్ని దర్శించుకున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ శనివారం పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సంక్షేమంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

అధ్వానంగా మురికికాలువలు

బీబీపేట,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండల కేంద్రంలో మురికి కాలువలు మరి అధ్వానంగా తయారయ్యాయి. సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.400 మీటర్ల పొడవు గల మురికి కాలువను నిర్మించడానికి అధికారులు, ఆయా పార్టీల నాయకులు ముందుకు రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం ధ్వంసమై ఉన్న మురికికాలువను పందులు,కుక్కలు మరింత ధ్వంసపరుస్తున్నాయి. మురికినీరు ముందుకు కొనసాగలేక ఎక్కడికక్కడ నిలువ ఉండడంతో దోమలబెడద, మురికివాసన తలెత్తుతూ కాలనీవాసులు రోగాల భారినపడుతున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు చొరవ చేసుకుని మురికి కాలువ నిర్మాణానికి తమవంతు బాధ్యతను గుర్తుచేసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వరి ధాన్యం అన్‌లోడ్‌లో అవకతవకలు

మద్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. కానీ వరి ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లేసరికి సరుకు తక్కువగా చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శనివారం కుర్లా గ్రామానికి చెందిన రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. డోంగ్లి మండలంలోని కుర్లా గ్రామంలో ఇటీవల ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో రైతుల నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. శుక్రవారం కుర్లా గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు కొనుగోలు కేంద్రంలో 650 బస్తాలను విక్రయించారు. ఈ బస్తాలు లారీలు లోడి చేసేటప్పుడు 650 ఉన్నాయని, రైస్ మిల్లుకు వెళ్లేసరికి 40 బస్తాలు తక్కువగా వస్తున్నట్లు రైస్ మిల్లు యజమాని వరి ధాన్యం విక్రయించిన రైతులకు ఫోన్ ద్వారా తెలియజేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం ప్రభుత్వం ప్రభుత్వం గిట్టుబాటు ధర అందచేస్తుందని ఒకవైపు ఆనందంలో ఉన్న రైతులు రైసుమిల్లు యజమానుల వద్దకు వెళ్లేసరికి వరి ధాన్యం 40 బస్తాలు తక్కువగా వస్తున్నట్లు చూపించడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



కుర్లాలో ధాన్యం తూకం వేస్తున్న రైతులు

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

దర్శన్ - గుడ్ బ్యాడ్ అగ్లి
ప్రియా 70 - జాక్
ప్రియా 35 - అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

బాన్సువాడ

మహేశ్వరి - జాక్
వెంకటేశ్వర - గుడ్‌బ్యాడ్‌అగ్లీ

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

